www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 5 నవంబర్ 2024

రాజధాని నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం అందజేత

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర రాజధాని నిర్మాణానికి, అన్న క్యాంటీన్ నిర్వహణకు, రాయచోటి నియోజకవర్గ వ్యాపారులు, వర్తకులు ఇచ్చిన రూ.10 లక్షల విరాళాన్ని సోమవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దాతలకు అభినందనలు తెలియజేశారు.

చెక్‌ను సిఎం చంద్రబాబుకు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రెవెన్యూ శాఖలో 30 ఏళ్ల నుంచి అరకొర వేతనాలతో పనిచేస్తున్న విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని అప్పులతో నెగ్గుకొస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్న గ్రామ సేవకుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్త శుద్ధి లేదని అన్నారు. తెలంగాణలో లాగా పే స్కేల్ అమలుచేయలని ఎనిమిదేళ్లుగా విఆర్‌ఎలకు వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న విఆర్‌ఎలను నామినిలుగా గుర్తించాలన్నారు. అర్హులైన వారందరినీ వాచ్మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, విఆర్‌ఒలు, ఇతర ఉన్నత ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కరికి కూడా ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం లేదని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా నైట్‌వాచ్‌మెన్‌లుగా పంపుతున్నారని, ఆ సమయంలో భద్రత లేదని ఆరోపించారు. ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా వేసే నైట్ డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇవిఎంలు, ఇతర పనులు చేయడంలో విఆర్‌ఎలు కీలక పాత్ర పోషించారని చెప్పారు. గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. విఆర్‌ఎ సమస్యలపై ఈనెల 18న చలో విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి తరలి రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాల విఆర్‌ఎలు నరసింహులు, అల్లాబకాష్, శ్రీను, నాగరాజు, మధు, సుధాకర్, యస్.రమణ, రామచంద్ర, మల్లికార్జున, రెడ్డెయ్య, శంకర్,మగ్ బూల్, వెంకట సుబ్బయ్య, పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు, సిఐటియు నాయకులు

ప్రణాళిక బద్ధంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లు ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులతో ఈనెల 21న నిర్వహించబోయే సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఇఇ భరత్, సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10లోగా ఓటర్ల జాబితా సిద్ధం అవ్వాలని, ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనబోయే అధికారులకు, సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖ ఇఇ ని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రత్యేకంగా ఆధార్ సేవలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా జిల్లాలో ఒక యజ్ఞంలా అపార్ యూనిక్ ఐడి క్రియేట్ చేయడానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ హాలు నుంచి ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంఇఒలు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ అధికారులతో విసి ద్వారా 'అపార్ యూనిక్ ఐడి' ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జిల్లాలో ఎంత శాతం మేర పిల్లలకు అపార్ యూనిక్ ఐడి జారీ చేశారు, యూనిక్ ఐడి జారీలో ఏర్పడుతున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో చదివే పిల్లలందరికీ ఒకే యూనిక్ ఐడి ఉండాలన్న ఉద్దేశంతో ఎంతో ప్రాధాన్యతగా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థి వివరాలతో ఈ అపార్ యూనిక్ ఐడిని జారీ చేస్తారన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 52 శాతం మేర అపార్ యూనిక్ ఐడి జనరేట్ చేయడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా రెండు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. స్కూల్ సర్టిఫికెట్‌లో ఉన్న పేరు పుట్టిన తేదీ, ఆధార్‌లో భాష దోషాలు, పుట్టిన తేదీ తేడా వల్ల ఎక్కువ సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ముందుగా ప్రతి గ్రామం, ప్రతి స్కూలు, ప్రతి మండలంలో వారి పరిధిలోని స్కూల్లో ఎంతమంది పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి, ఎంతమందికి లేట్ బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంది అన్న సమాచారంతో స్పష్టంగా జాబితాను రూపొందించుకోవాలన్నారు. తదుపరి మండలం, మున్సిపల్ కేంద్రంలోని ప్రతి ఆధార్ సెంటర్ వద్ద ప్రాథమిక వసతులు ఏర్పాటు చేసి ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటుచేసి ఆధార్‌లో ఉన్న తేడాలను సరి చేయాలన్నారు. ప్రతి ఆధార్ కేంద్రం వద్ద మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్లను పెట్టి సేవలను విస్తృతం చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఉన్న అందరు విద్యార్థులకు అపార్ యూనిక్ ఐడిని తప్పనిసరిగా క్రియేట్ చేయాలని సూచించారు. ఆధార్‌లో తప్పొప్పులు సరి చేయాలంటే పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఎంతో ముఖ్యమన్నారు. గత 15 సంవత్సరాలలో పుట్టిన పిల్లలందరికీ కూడా పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒల వద్ద రికార్డు ఉంటుందని చెప్పారు. వారి పరిధిలోని పాఠశాలల్లో కూర్చొని సర్టిఫికెట్లను జిరాక్స్ చేసి హెచ్‌ఎంలకు ఇవ్వాలన్నారు. ఎవరికైతే జనన పత్రాలు నమోదు అవ్వలేదో వాళ్లకు లేట్ బర్త్ సర్టిఫికెట్ జారీకి విఆర్‌ఒ, తహశీల్దార్, ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులకు లేట్ బర్త్ సర్టిఫికెట్ కావాలన్నది స్పష్టత ఉండాలన్నారు. మంగళవారం సాయంత్రం తిరిగి ఈ అంశంపై సమీక్షిస్తామని అప్పటికి ఎంతమంది పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయి, ఎంతమందికి లేవు, ఎంతమందికి అపార్ యూనిక్ ఐడి జారీ అయింది, ఎంతమందికి కాలేదు అన్న వివరాలలో తాజా సమాచారంతో సమావేశంలో పాల్గొనాలన్నారు. 70 శాతం పిల్లల రికార్డ్స్ ఆధార్‌తో సరిపోతున్నాయి. ఎక్కడైతే సరిపోలేదో అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకొని అపార్ యునిక్ ఐడి క్రియేట్ చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు సోమవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగాయి. రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా హరిప్రసాద్, గౌరవాధ్యక్షులుగా సుధాకర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ జాబీర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్లుగా శివారెడ్డి, హేమలత కోశాధికారిగా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులుగా బి.వెంకటరమణ, కె.ఆదినారాయణ, టి.భాస్కర్‌రెడ్డి, వై.శ్రీధర్‌రెడ్డి, ఎస్.దావుద్దీన్, ఎ.అక్రంబాషా పి.వెంకటసుబ్బయ్య, సివి.రమణ మూర్తి, కె.శ్రీలత, కె.ఫణీంద్ర ప్రసాద్ యాదవ్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వి.సురేంద్రరెడ్డి ఎన్నిక య్యారు. మెంబర్స్‌గా ఎం.రమణయ్య, వై.మస్తా నయ్య, ఎస్.ప్రసాద్, టి.అజ్మతుల్లా, ఎ.శివశంకర్, ఎ.విశ్వనాథ్‌రెడ్డి, నీలేష్‌లను ఎన్ను కున్నారు. స్టేట్ కౌన్సిలర్లుగా బి.హరిప్రసాద్, కె.హేమలత, డి.చంగల్ రాజు, టి.శివారెడ్డి ఎన్నిక య్యారు. డిస్టిక్ సబ్ కమిటీ కన్వీనర్స్, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్‌గా అంజాద్, స్పోర్ట్స్ సబ్ కమిటీ కన్వీనర్‌గా ఆర్.సుధాకర్ ప్రచురణ కమిటీ కన్వీనర్‌గా విజయ్ కుమార్, మోడల్ స్కూల్ టీచర్స్ కన్వీనర్ పి.సాదిక్ ఖాన్, మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్‌గా ఇ.సుధాకర్, కల్చరల్ సబ్ కమిటీ కన్వీనర్‌గా బి.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, మెంబర్లను యుటిఎఫ్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటూ అభివృద్ధిలోకి తీసుకొచ్చి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సభ్యులందరి సహకారంతో తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతగా పని చేస్తామన్నారు.

జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్

జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌జాబీర్

సంఘాల సమాచారం యాప్‌లో పొందుపర్చాలి : మెప్మా పీడీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో పొందపరచాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఎస్‌హెచ్ జి ప్రొఫైలింగ్ యాప్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా మెప్మాలో ఉన్న మహిళా సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేదని అందువల్ల మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వాస్తవిక సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో నమోదు చేయడం కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా సంఘాలలో జరుగుతున్న అప్పులు, పొదుపులు అనే వివరాలతో పాటు ఎస్ హెచ్‌జి సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక లావాదేవీలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు అన్నారు. మహిళా సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడటం, ఆర్థిక ప్రణాళిక తయారు చేయడానికి ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రతి నెలా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు యాప్ ద్వారా అమ్ముకొనుటకు వీలుంటుందని చెప్పారు. యాప్‌లో సమాచారాన్ని పొందుపరచుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న టిఇలు, సిఎంఎంఎస్, సిఒలు, ఇఒలు, డిఆర్‌పిలు, టిఎల్‌ఎఫ్‌లు, ఆర్‌పిలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్

మద్యం దుకాణాల ఏర్పాటుకు నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రకటించిన నిబంధనలను తప్పనిసరిగా యజమానులు పాటించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ అన్నారు. సోమవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ సిఐ టి.కె.తులసి సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 111 మద్యం దుకాణాలు ఉన్నాయని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని రైల్వేకోడూరులో 11 మద్యం దుకాణాలు, చిట్వేల్‌లో 4 ఓబులవారిపల్లెలో 4 దుకాణాలు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేవారు బడి, గుడికి వంద మీటర్ల దూరం ఉండాలన్నారు. ప్రధాన రహదారికి 20 వేల జనాభా లోపల ఉన్న ప్రాంతంలో 220 మీటర్లు దూరం ఉండాలని, 20 వేల జనాభాకు మించిన ప్రాంతాలలో 500 మీటర్ల దూరంలో దుకాణాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. దుకాణదారులు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 7వ తేదీలోగా మద్యం దుకాణాల యజమానులకు పక్కా లైసెన్సులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి-రామాపురం

యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదని జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, ముఖ్య అతిథి వెంకటేశ్వర్లు యువతకు పిలుపునిచ్చారు. స్థానిక బిట్స్ కళాశాలలో కడపకు చెందిన నెహ్రూ యువ కేంద్రం కలిసి సోమవారం 'డ్రగ్ అడిక్షన్ అండ్ ఏబ్యూజ్' అనే అంశంపై యువతకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు యువత చెడు వ్యసనాలకు బానిసై తమ అమూల్యమైన భవిష్యత్తును కోల్పోతున్నారని చెప్పారు. ముఖ్యంగా గంజాయి, గుట్కా, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. సమాజం పట్ల యువత బాధ్యతను మరిచి పెడదారి పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నేటి యువతే రేపటి తరానికి నాయకత్వం వహించాల్సి వస్తుందని, అలాంటి యువత పెడదారి పడకూడదు అన్నారు తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో కళాశాలలకు పంపిస్తే చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సారి పోలీస్ కేసులలో చిక్కుకుంటే జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని తమ తల్లిదండ్రుల ఆశలను, చదువుకున్న కళాశాలలకు మంచి పేరు తీసుకు రావాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో విఆర్ సంస్థల అధినేత వెంకటరామిరెడ్డి, బిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు 150 విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అంగన్వాడీలపై అక్రమ కేసు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు: అంగన్వాడీలపై అక్రమ కేసు నమోదు చేశారని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 14వ తేదీన అంగన్వాడీల వేతనాలు పెంచాలంటూ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించామని పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రజల శాంతికి భంగం కలిగించారని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు 2023 డిసెంబర్ 14న కేసు నమోదు చేశారని చెప్పారు. ఆ కేసుకు సంబంధించి 11 నెలల అనంతరం సోమవారం 41 నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలే ప్రధానం

మాట్లాడుతున్న క్లోడి డయాస్

ప్రజాశక్తి-మదనపల్లి

నిర్మాణ రంగంలో తాజా పద్ధతులు, నాణ్యతా ప్రమాణాలు ప్రధానమని బెంగళూరు శోభాలిమిటెడ్ మేనేజర్ క్లోడీ డయాస్ అన్నారు. సోమవారం స్థానిక మిట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్మాణంలో నాణ్యత నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా క్లోడీ డయాస్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలపై అధ్యాపకులు, విద్యార్థులను దృష్టి సారించాలన్నారు. నిర్మాణ నాణ్యత నిర్వహణలో నాణ్యత నియంత్రణ, వినూత్న పద్ధతులు, మన్నిక, సామర్థ్యాన్ని పెంచే ఉత్తమ అభ్యాసాలను తెలుసుకోవాలని, వేగంగా విస్తరిస్తున్న నిర్మాణ రంగంలో, ఒక ప్రాజెక్ట్ యొక్క భద్రత, మన్నిక మరియు విజయం కోసం అధిక నాణ్యత ప్రమాణాలను నిర్వహించడం చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లు సకాలంలో, బడ్జెట్‌లో పూర్తయ్యేలా, అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చేయడంలో నిర్మాణంలో నాణ్యత నియంత్రణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నివాస గృహాల నుండి వాణిజ్య భవనాల వరకు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నుండి పారిశ్రామిక అభివృద్ధి వరకు, సమర్థవంతమైన నాణ్యత నియంత్రణ చర్యలు ఉన్నతమైన ఫలితాలకు, ఖాతాదారుడు (క్లయింట్) సంతృప్తిని పెంచడానికి, నిర్మాణ సంస్థలకు మెరుగైన ఖ్యాతిని కలిగిస్తాయని పేర్కొన్నారు. నేటి నిర్మాణ పరిశ్రమలో, నాణ్యత నియంత్రణను తనిఖీ చేయడానికి గ్రౌండ్ నుండి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అలా ఇవ్వడం ద్వారా, నిర్మాణ సంస్థలు స్థిరమైన వృద్ధిని సాధించగలవని చెప్పారు. సురక్షితమైన నిర్మాణాలను నిర్మించగలవన్నారు. ఖాతాదారులకు విలువను అందించగలవని తెలిపారు. నాణ్యత నియంత్రణలో పెట్టుబడి పెట్టడం ఆస్తులను రక్షించడం, ప్రమాదాన్ని తగ్గించడమే కాకుండా పరిశ్రమలో నమ్మకాన్ని, సానుకూల ఖ్యాతిని కూడా పెంచుతుందని పేర్కొన్నారు. నాణ్యత, అన్నింటికంటే, ప్రతి గొప్ప నిర్మాణాన్ని నిర్మించే పునాదన్నారు. కార్యకమంలో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల సివిల్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, కో-ఆర్డినేటర్ డాక్టర్ సోను కుమార్ గుప్తా, డాక్టర్ ప్రియమ్ నాథ్ భౌమిక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

- ఎపివిబిఎస్ కోర్ కమిటీ కన్వీనర్ గోవింద్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

వాల్మీకి, బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సమాజ్ రాష్ట్ర కోర్ కమిటీ కన్వీనర్ నాగినేని గోవింద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఎపివిబిఎస్ నూతన కమిటీని నాగినేని గోవిందు, రాష్ట్ర ఎక్సిక్యూటివ్ మెంబర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారిన బోయలను ఎస్‌టిలుగా చేరుస్తామని మాయమాటలు చెబుతున్నారే తప్ప ఇంతవరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా వెరయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా బోయలను ఎస్‌టిలుగా చేయాలనే తమ ప్రధానమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని కూటమి ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళిక ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బోయ విద్యార్థులను ఎస్‌టిలో చేర్చి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ భవనాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులకు ధ్రువపత్రాలు అందజేశారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక : వాల్మీకి, బోయ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా తలారి శ్రీనివాసులు, కొత్తూరు చిన్న రెడ్డెప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మనపల్లి లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా చెన్నం వెంకట్రమణ, కార్యదర్శులుగా పారేసు రాజ్ గోపాల్, మేకల లక్ష్మినారాయణ, పారేశ రెడ్డిభాస్కర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కోట రమణ, జిల్లా అధికార ప్రతినిధిగా కొటుకు శేఖర్, టౌన్ ప్రెసిడెంట్‌గా బద్రా లక్ష్మిపతి, మండల ప్రెసిడెంట్‌గా నాగినేని మల్లికార్జున, రామసముద్రం మండల ఉపాధ్యక్షులుగా సత్రం కదిరప్ప, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులుగా ప్రసాద్, మండలగా వైస్ ప్రెసిడెంట్ కొత్తేరు శ్రీనివాసులు, మండల కార్యదర్శిగా పిల్లి కృష్ణమూర్తి ఎంపికయ్యారు.

మాట్లాడుతున్న ఎపివిబిఎస్ కోర్‌కమిటీ కన్వీనర్ గోవింద్

హోం మంత్రి అనితకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాష

హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని సోమవారం మదనపల్లి మీదుగా అనంతపురానికి వెళుతున్న హోం మంత్రి వంగలపూడి అనితను ఎమ్మెల్యే షాజహాన్ బాషా బైపాస్ రోడ్డులో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనిత మాటాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మదనపల్లి నియోజకవర్గంలో నేరాల నియంత్రణకు సహకారం అందిస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు, భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని ఎమ్మెల్యేకి సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హోం మంత్రిగా అనిత సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని, నేరాలను పూర్తిగా నియంత్రించేందుకు మంత్రి చేస్తున్న కృషిని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనితల నేతృత్వంలో ఎపి నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దబడుతోందన్నారు.

'పంతగాని' నివాసంలో హోం మంత్రి

రైల్వేకోడూరు : హోం మంత్రి అనిత రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంత గాని నరసింహ ప్రసాద్ తిరుపతిలోని నివాసానికి సోమవారం తేనీటి విందులో పాల్గొన్నారు. తిరుపతికి వచ్చిన అనిత పంతగాని నరసింహ ప్రసాద్ నివాసం వద్దకు రాగా పంతగాని ఆయన సతీమణి డాక్టర్ నీలిమ, కుమార్తెలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గంలో కూటమి రాజకీయాలపై పలు సమస్యలను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

టెట్‌లో గంగాదేవి ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సోమవారం విడుదలైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలలో రాజంపేటకు చెందిన పత్తూరి గంగాదేవి హిందీ విభాగంలో 150కి 104 మార్కులు సాధించిందినట్లు ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్కులు సాధించడానికి ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ అవగాహన సదస్సు, ఉచిత తరగతులు ఎంతగానో ఉపయోగపడ్డాయని గంగాదేవి తెలిపారు. సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, అధ్యాపకులు చాంద్ బాషా, మూర్తి, పార్వతికి ఆమె కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు రమణ

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఉడుమువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో దలవాయిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ నవంబర్ 4 2010న ఉపాధ్యాయ వృత్తిలో ఇదే పాఠశాలలో చేరి 10 సంవత్సరాల పాటు పని చేశానన్నారు. 2021లో దలవాయిపల్లి పాఠశాలకు బదిలీ అయ్యానని చెప్పారు. నేటితో ఉపాధ్యాయ వృత్తిలో చేరి 14 వసంతాలు పూర్తిచేసుకుని 15వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తాను మొదట ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉడుమువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందని తెలియజేశారు. అనంతరం స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు మల్లీశ్వరి మాట్లాడుతూ మొదట పనిచేసిన పాఠశాలను గుర్తించుకొని విద్యార్థులకు సహాయం చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చిన్నఓరంపాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరిత అన్నారు. ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న ఓరంపాడు జూనియర్ కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు సెల్ ఫోన్స్‌ను అందుబాటులో లేకుండా చూడాలని, ప్రతిరోజు ఇంటికి వచ్చిన తర్వాత చదువుతున్నారా లేదా కళాశాలకు వెళ్తున్నారా లేదా కళాశాలలో నిర్వహించే పరీక్షల్లో మంచి మార్కులు వస్తున్నాయా లేదా అనే విషయాలను గమనించాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ పలు సూచనలు సలహాలు అందజేశారు. రానున్న నాలుగు నెలలు మీ పిల్లలు కష్టపడి చదివే బాధ్యత తల్లిదండ్రులుగా మీరు తీసుకోవాలని, ఉపాధ్యాయులుగా కళాశాలలో తమ బాధ్యతలను మేము సక్రమంగా నిర్వర్తిస్తున్నామని తల్లిదండ్రులుగా మీరు మీ పిల్లలపై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి : 'నల్లారి'

ప్రజాశక్తి-గుర్రంకొండ

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామలలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే దృష్టికి మండల నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. టిడిపి కార్యకర్తలు ,టిడిపి నాయకులు, అధికారుల దగ్గరికి సమస్యలు తీసుకోవస్తే ఖచ్చితంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుర్రంకొండ మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్, మాజీ ఎంపిటిసి ఎజాజ్ అహ్మద్, ఎల్లుట్ల మురళి, మూర్తి రావు, జగదీష్, మేకల చలపతి, టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు

విద్యుత్ మీటర్ల మార్పునకు వినతి

ప్రజాశక్తి-పీలేరు : పట్టణ పరిధిలోని మతపరమైన వాటికి విద్యుత్ మీటర్లు మార్పు చేయాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష ట్రాన్స్‌కో ఇఇని విన్నవించినట్లు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక గ్రామ పంచాయతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని మతపరమైన దేవాలయాలు, మసీదులు, మదరసాలు, దర్గాలు, చర్చలకు ప్రస్తుతం ఉన్న విద్యుత్ కేటగిరీ మీటర్లతో ఎక్కువ విద్యుత్ చార్జీలు వస్తున్నాయన్నారు. ప్రస్తుత కేటగిరీలను తొలగించి, వాటిని కేటగిరి-4లో చేర్చి విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఈఈని కోరామని చెప్పారు. సమావేశంలో ఎంపిటిసి జైపాల్ రెడ్డి, వార్డు సభ్యులు శ్రీనాథ రెడ్డి, పరమేష్, విక్టరీ వెంకటరమణా రెడ్డి, సాంబశివారెడ్డి, ఆబిద్, పిక్కా రమణ, తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులతో పోటెత్తిన మల్లయ్య కొండ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తుల తో కిటకిటలాడింది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండ పై కేదారేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించి నోములు నోచుకున్నారు. పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారి కి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మదనపల్లి వన్ డిపో మేనేజర్ వెంకట్ రమణారెడ్డి మల్లయ్య కొండపైకి రెండు బస్సులను ఏర్పాటు చేశారు.

అయ్యప్ప స్వాములకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రాయలసీమ బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వామి భక్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక నిమ్మనపల్లి రోడ్డు బసినికొండ వద్ద రాయలసీమ బలిజ సేవా సమితి అధ్యక్షులు వైశ్యా బ్యాంకు రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిదిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రాయలసీమ బలిజ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎన్.మునిగోపాల కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా అయ్యప్ప స్వాములకు దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్రాంత వైశ్య బ్యాంక్ ఉద్యోగిగా, రాయలసీమ బలిజ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులుగా బ్యాంక్ రమణ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. రమణ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్ర మాల్లో భాగంగా చలికాలంలో దుప్పట్లు పంపిణి చేయడం, విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ రాయలసీమ సేవా సమితి సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనివ్వడం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో సందీప్, కిరణ్, ఎపిఎం మురళి కృష్ణ, షంషీర్, శివ, స్థానిక పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి మురళి, పాల్గొన్నారు.

11న మగ్దూం బాబా ఉరుసు

ప్రజాశక్తి - నందలూరు : మండల కేంద్రమైన నందలూరులో వెలసిన మగ్దూం బాబా దర్గాలో ఈ నెల 11వ తేదీన ఉరుసు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చిన్న పీఠాధిపతి హైదర్ సాహెబ్ తెలిపారు. ఉరుసు మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని చిన్న పీఠాధిపతి హైదర్ సాహెబ్ సోమవారం రాజ్యసభ సభ్యులు రఘునాథ రెడ్డిని, మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయ భాస్కర్ రెడ్డిని, సిద్ధవటం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ మేడ మధుసూదన్ రెడ్డిని మరియు ఆయన కుమారుడు గౌతమ్‌రెడ్డిని, మేడ కుటుంబీకులను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగినది. ఈ సందర్భంగా హైదర్ సాహెబ్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన గంధం, 11వ తేదీన ఉరుసు మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉరుసు మహోత్సవ కార్యక్రమానికి నందలూరు మండల అశేష జనావాహిని సాహెబ్ను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కలికిరి : స్థానిక మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీ పాత హరిజనవాడ నందు సిమెంట్ రోడ్డును సర్పంచ్ రెడ్డి రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మరికుంటపల్లి గ్రామపంచాయతీ పాత హరిజనవాడకు నాలుగు లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు మంజూరవడంతో ఈ రోడ్డున ప్రారంభించామని రాబోవు కాలంలో మరింత నిధులు వెచ్చించి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతామని తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం : కలెక్టర్

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం కావాలని, అర్జీదారుల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగుతుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను ఎప్పటికప్పుడూ వేగవంతంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్య వచ్చిన మరుసటి రోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయాలని పేర్కొన్నారు. అర్జీదారులతో కలిసి ఫొటో దిగి సమస్యను విచారణ చేయాలన్నారు. అవసరమైతే నోటీసు ఇచ్చి గడువు తర్వాత సమస్య తమ పరిధిలో ఉంటే తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పై స్థాయికి వెళ్లాల్సి ఉంటే ఆ విషయాన్ని అర్జీదారుకు స్పష్టంగా వివరించి తగిన ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకుండా ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల గురించి మండల తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆ మండలానికి సంబంధించి ఎన్ని వచ్చాయి, ఎప్పుడు వచ్చాయి, ఫీల్డ్‌కు వెళ్ళారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా మండల తహశీల్దార్లు, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒలు, ప్రాధాన్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన దరఖాస్తులలో మూడు రోజుల్లోపు పరిష్కరించాల్సినవి ఇంకను 47 దరఖాస్తులు ఉన్నాయని ఇందుకు గల కారణాలను ఆయా మండల తహశీల్దార్లను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. జిల్లా అధికారులందరూ కూడా వారి శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడూ నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య గణన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్)పై మండల స్థాయిలో గ్రామ సచివాలయ సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యభివృ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని సచివాలయ సిబ్బందికి, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బందికి, ఉపాది కార్యాలయం సిబ్బందికి నైపుణ్య గణన-2024 శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన సిబ్బంది మండల స్థాయిలో గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నైపుణ్య గణన సర్వేలో 15 నుంచి 59 ఏళ్ల వయసు గల వారి నుంచి సమగ్ర సమాచారంను సేకరిస్తారని తెలిపారు. ప్రాంతీయ పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ఉపయోగ పడుతుందని తెలియజేశారు. గ్రామ సచివాలయాలు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇతర శాఖల సిబ్బంది స్కిల్ సెన్సస్ సర్వేలో పాల్గొంటారన్నారు. నైపుణ్య గణన ద్వారా జిల్లాలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరచటానికి వీలవుతుందన్నారు. ఆధార్ ఆధారిత ఒటిపి, బయోమెట్రిక్ ద్వారా యానిమరేటర్లు వివరాలను సేకరిస్తారని, ఒటిపిని బహిర్గతం చేసే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహల గురికావద్దని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరూ సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. **చిన్నమండెం:** నైపుణ్య గణన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి ఎంపిడిఒ దివ్య తెలిపారు. సోమవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక్కో అభ్యర్థికి 10 నుంచి 25 ప్రశ్నలు నమోదు చేయాల్సి రావటంతో పది నిమిషాల వరకు సమయం పడుతుందని, ప్రజలు విద్యార్హత సర్టిఫికెట్లు ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగా సిద్ధం చేసుకుని ఉంటే సర్వే త్వరగా పూర్తి చేసే వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శేఖర్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ట్రైనర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. **కలికిరి:** నైపుణ్య గణనపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల స్థాయి అధికారులకు ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆదేశించారు. మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇతర శాఖల సిబ్బంది స్కిల్ సెన్సస్ సర్వేలో పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న నైపుణ్య గణనను ట్రైనర్ బి.నవాజులా, మర్రికుంటపల్లె, షేక్ మహమ్మద్ తాయిబ్ పాల్గొన్నారు. **నందలూరు :** మండల స్థాయి నైపుణ్య గణన శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపిడిఒ సుజాతమ్మ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇతర శాఖల సిబ్బంది స్కిల్ సెన్సస్ సర్వేలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ పెంచలయ్య పాల్గొన్నారు.

మదనపల్లెను అగ్రస్థానంలో నిలుపుదాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీలో నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో సభ్యత్వ నమోదులో మదనపల్లెను అగ్రస్థానంలో నిలుపుదామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బెంగుళూరు రోడ్డు కుమారపురం వద్ద మాజీ కౌన్సిలర్ తలారి రాధమ్మ, రైస్ మిల్ శశికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు వాసు, రవీంద్ర సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె పట్టణంతో పాటు నియోజకవర్గంలోనూ పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేస్తామన్నారు. ఇందులో కార్యకర్తలు, నాయకులు పరస్పరం సహకారంతో లక్ష్యాన్ని అదిగమించాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు చేసుకొన్న వారికీ తెలుగుదేశం అండగా ఉంటుందన్న విషయంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకొన్న వారికీ రూ.5 లక్షల బీమా తెలుగుదేశం పార్టీ కల్పిస్తుందన్నారు. గతంలో సభ్యత్వం తీసుకున్న వారు తిరిగి దాన్ని పునరుద్ధరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిఎంచంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పచ్చదనంతోనే మానవాళికి మనుగడ

సిఆర్‌పిఎఫ్ కేంద్రంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-కలికిరి

పచ్చదనంతోనే మానవాళికి మనుగడ సాధ్యమవుతుందని జెఎన్‌టియు కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం వారి కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల సందర్భంగా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కలికిరిలోని సిఆర్‌పిఎఫ్ కేంద్రంలో 20 రకాల పండ్లు, 500 వివిధ రకాల మొక్కలను నాటారు. ఇలాంటి పండ్ల చెట్లను నాటడం ద్వారా పక్షులు, జంతువులకు ఆహారాన్ని అందించడమే కాకుండా, వాటి ద్వారా ప్రకృతికి మేలు జరుగుతుండడంతో ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో పెట్టే విపరీతమైన ఖర్చుతో కూడిన సాంప్రదాయ సమావేశాల బదులుగా, ఈ విధంగా పండ్ల చెట్లను నాటడం ద్వారా వేడుకలను సార్థకం చేసుకో వచ్చునని తెలిపారు. వన్య ప్రాణులు అడవులు వదిలి ప్రజలు తిరుగు ప్రాంతాలకు వస్తున్నాయని, వీటిని అరికట్టేందుకు మా ప్రయత్నం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వారి పిల్లలతో కలిసి చెట్లు నాటడం. పిల్లల చేత ఈ కార్యక్రమం చేయించడం వల్ల భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వారి పిల్లలు, సీఆర్పీఎఫ్ డిఐజి, కమాండోలు, డిప్యూటీ కమాండెంట్లు, సిఆర్‌పిఎఫ్ సైనికులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

స్క్రీనింగ్ టెస్ట్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా అర్హులైన పేద ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల డిఎస్‌సి ఉచిత శిక్షణ కోసం నిర్వహించే స్క్రీనింగ్ టెస్టు గడువును ఈనెల 10 వరకు పొడగించిందని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారతాధికారి ఎన్. జయ ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు (https// jnanabhumi.ap.gov.in) వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాల కోసం 9440256697లో సంప్రదించాలని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ

ప్రజాశక్తి -వీరబల్లి

మండలంలోని రైతు సంఘంలోని రైతులు టార్పాలిన్ పట్టలు సద్వినియోగం చేసుకోవాలని మండల వెలుగు కో-ఆర్డినేటర్ ఖాదర్‌వలి కోరారు. సోమవారం మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన 18 కి 24 సైజు గల పట్ట రూ. 1650కు ఇస్తున్నామన్నారు. పట్టలు కావాల్సిన రైతులు మీ పరిధిలోని రైతు మిత్రలను కలిసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిజిసిసి గంగాధరం, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రైతులకు టార్పాలిన్ పట్టలు అందిస్తున్న ఎపిఎం

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం : అన్ని దానాలలో అన్నదానం గొప్పదని రాయచోటి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శివారెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన కలమల మౌలాలి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు కలమల మౌలాలి(చిన్న) ఆర్థిక సాయంతో ప్రేమలయం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అనంతరం దాత కలమల మౌలాలి మాట్లాడుతు తమ తండ్రి జ్ఞాపకార్థంగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశామన్నారు. రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దాత భార్య హసీనా, పిల్లలు మహ సారా, సన, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్ల పనులు పరిశీలన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : పల్లెపండుగలో భాగంగా మండలంలో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణాలు నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని ఇఒపిఆర్‌డి మునిరాజకుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తంబళ్లపల్లె, సిద్ధారెడ్డిగారిపల్లె, రెడ్డికోటల్లో చేపడుతున్న సిసిరోడ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. నిర్మాణ పనులపై ఏఈ హరినాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శేషాద్రి, అలేఖ్యల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణాల్లో ఎక్కడ నాణ్యత లోపం లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్య క్షుడు నరసింహులు, నరేంద్ర నాయుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణమోహన్

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు

- 5.7 కిలోల గంజాయి, 3 సెల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గంజాయి కేసులో పరారిలో ఉన్న ఐదుగురు మహిళా ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు రాయచోటి డిఎస్‌పి కృష్ణ మోహన్ అన్నారు. సోమవారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో గత నెల 26న పట్టణంలోని నాయబ్ సాబ్ వీధికి చెందిన జమాల్ బాషాను గంజాయి కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపిన సంగతి తెలిసేందే అన్నారు. అదే కేసులో పరారిలో ఉన్న ఐదుగురు మహిళా ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 5.7 కిలో గంజాయి, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఇందులో ఓ మహిళా పై గతంలో గంజాయి కేసు నమోదైందని అన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. అన్నమయ్య జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని అన్నారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ నరసింహారెడ్డి, సిబ్బందని అభినందించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

చిన్నరాముడు (ఫైల్ ఫొటో)

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందారని ఎఎస్ఐ జిలానిబాష తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ దిగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నరాముడు (45) ఆదివారం సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో ఊరికి సమీపంలోని పెద్దచెరువు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీటిలో గల్లంతయిన వ్యక్తిని స్థానికులు గుర్తించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య డి.జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.జిలానీబాష తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు...

ప్రజాశక్తి-కలికిరి

మృతి చెందిన కోళ్ల రెడ్డప్ప

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీ సులు కథనం మేరకు.. సోమవారం తెల్లవారుజామున వాల్మీకి పురం మండలం కొండ కింద మేకలవా రిపల్లికి చెందిన కోళ్ళ రెడ్డప్ప(40) ఆవుల వ్యాపారం నిమిత్తం ద్విచక్ర వాహనంపై కలకడ వైపు వెళుతుండగా కారు ఢీకొట్టింది. కింద పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న స్థానికులు రెడ్డప్ప భార్య మమత, బంధువులు ప్రమాదం జరిగినా ప్రదేశంకు చేరుకొని, గాయపడిన రెడ్డప్పను కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెడ్డప్పకు తగిలిన బలమైన రక్త గాయాలు కాడంతో ఆయన మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెడ్డప్ప మృతితో కొండకింద మేకలవారిపల్లిలో విషాదచాయాలు నెలకొన్నాయి.

భవనంపై నుంచి పడి కార్మికుడు...

ప్రజాశక్తి-పీలేరు

మృతి చెందిన ఇబ్రహీం

నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమా దవశాత్తు జారిపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. సోమవారం పట్టణంలోని సైనిక్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి మూడో అంతస్థ నుంచి పి. ఇబ్రహీం (40) అనే కార్మికుడు జారి క్రింద పడ్డాడు. బాధితుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పరీక్ష చేయగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బలరాం మాట్లాడుతూ బాధితుడికి భవన నిర్మాణ కార్మిక సంఘం గుర్తింపు కార్డు కూడా నువ్వేనందున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, సారా స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు...మండలంలోని బండ్లపై పంచాయతీ, బండ్లపై హరిజనవాడకు చెందిన జి.చెంగప్ప, జి.రామలక్ష్మి నాటు సారా తయారు చేసి గ్రామానికి సమీపంలో విక్రయిస్తుండగా సోమవారం స్థానిక పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నాటు సారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెంపో ఢీకొని 15 మందికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టెంపో ఢీకొనడంతో 15 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం చిన్నమండ్యం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. చాకిబండకు చెందిన 15 మంది కూలీలు గుర్రంకొండ మండలం, కోనా క్రాస్ వద్దకు కూలి పనులకు ఆటోలో వెళ్లారు. కోన క్రాస్ వద్ద వీరి ఆటోను టెంపో ఢీకొనడంతో కూలీలందరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చాకిబండకు చెందిన రమణమ్మ(45) పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుర్రంకొండ ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. మండలంలోని వలసపల్లె గ్రామం, ఎర్రబల్లెకు చెందిన సూర్య నారాయణ (48) మద్యానికి బానిసగా మారాడు. కుటుంబ సభ్యులను పట్టించుకోక పోగా మద్యానికి డబ్బు ఇవ్వాలని తరచూ వేధించేవాడు. సోమవారం మద్యానికి డబ్బు ఇవ్వలేదని కుటుంబీకులపై ఆగ్రహంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.